# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

శనివారం 15-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial




## ముగిసిన ప్రధాని ఫ్రాన్స్ టూర్

### ఫ్రాన్స్‌లో పోచంపల్లి చీర

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 15)**


ప్రధాని నరేంద్ర మోడీ ఫ్రాన్స్ టూర్ ముగిసింది. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ ఆ దేశ ప్రథమ మహిళకు చేతితో నేసిన పోచంపల్లి ఇకత్ చీరను బహూకరించారు. ఇరు దేశాధినేతలు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇందులో భాగంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు గంధపు చెక్కతో తయారు చేసిన సగీత వాయిద్యం సితార్ సరస్వతి విగ్రహాలు, ఆయన సతీమణి బ్రిగిట్టే మాక్రాన్‌కు చందనం పెట్టెలో పోచంపల్లి ఇకత్ చీరను ప్రధాని మోదీ అందజేశారు. అదేవిధంగా ఫ్రాన్స్ నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ యేల్ బ్రౌన్-పివెట్‌కు చేతితో అల్లిన పట్టు కశ్మీరీ కార్పెట్‌ను, ఫ్రెంచ్ సెనేట్ ప్రెసిడెంట్ గెరార్డ్ లార్చర్‌కు గంధపు చెక్కతో చెక్కిన ఏనుగు అంబారీని మోడీ బహూకరించారు. ఇక 20వ శతాబ్దంలో ఫ్రెంచ్ సాహిత్యంలోని ముఖ్యమైన నవలను మోదీకి మాక్రాన్ బహుమతిగా ఇచ్చారు.



## విల్లాలో కాల్పుల కలకలం

### వివాహేతర సంబంధమే కారణమా?

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై15):**



నగరశివార్లలోని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సెలబ్రిటి రిసార్ట్ విల్లాలో కాల్పుల కలకలం చెలరేగింది. నటుడు మనోజ్‌నాయుడు అనే వ్యక్తి సిద్ధార్థ్‌దాస్ అనే అతనిపై ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. కాల్పుల నుంచి తప్పించుకొని ఎలాగో ప్రాణాలతో బయటపడ్డ సిద్ధార్థ్‌దాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. తన భార్యతో సిద్ధార్థ్‌కు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే మనోజ్ కాల్పులకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. గాయాలైన సిద్ధార్థ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇంకా పూర్తి వివరాలు రావాల్సి ఉంది.



## వరల్ క్లాస్ సిటీ కాలేదు.. వరదలొచ్చాయి

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 15)**

ఢిల్లీని వరల్డ్ క్లాస్ సిటీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆపని చేయలేకపోయారని, ఢిల్లీని వరదలు మాత్రం ముంచెత్తాయని బీజేపీ ఎంపీ గౌతమ్‌గంభీర్ వ్యాఖ్యానించారు. దేశరాజధాని నగరం వరదల్లో చిక్కుకొని విలవిల్లాడటం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత ఆప్ ప్రభుత్వం నగరంలో మౌలిక సదుపాయాల కోసం ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదని, అందువల్ల నాకీ పరిస్థితి ఆశ్చర్యమేమీ కలిగించలేదన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి మాత్రం ప్రతిపక్షాల ఆరోపణలను కొట్టిపారేస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న బాధితులకు అండగా ఉండడమే తమ కర్తవ్యమని చెబుతున్నారు.




# వ్యూహం

## ఎవరిది వారిదే..

ఒకరికి ప్రజలు.. పథకాలు

మరొకరికి పదవులు..అధికారాలు

తెలంగాణలో ఇదీ సీన్

**తెలంగాణలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఎటొచ్చీ నాలుగైదు నెలల్లోగా అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి.ఉన్న కొద్దిపాటి సమయాన్నీ ఎలా సద్వినియోగం చేసుకోవాలా అని అన్ని పార్టీలూ ఆలోచిస్తున్నాయి. అయితే ప్రజలకు మేలు చేసేందుకు ఏయే పథకాల్ని స్పీడప్ చేయాలి..కొత్తగా ఇంకేమైనా ఆసరాలు కల్పించవచ్చా? అని అధికార బీఆర్ఎస్ ఆలోచిస్తుంటే.. ఎవరిని తమ పార్టీలోకి లాగాలి? అదే తమ బలమని చెప్పువాలి అని ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు యోచిస్తున్నాయి.**

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై11):**

నోటిఫికేషన్ వచ్చింది లేదు.. పోటీ చేసింది లేదు..కానీ తమ పార్టీ నుంచి సీఎం అయ్యేది ఎస్సీ అని,ఎస్టీ అని, బీసీ అని సంకేతాలు వెళ్లే విధంగా ఒక పార్టీ వ్యవహరిస్తుంటే.. మరో పార్టీ అధికారమే యావగా హండ్రెడ్ డేస్ యాక్షన్ ప్లాన్‌కు,'టిఫిన్ బైఠక్' లకు సిద్ధమైంది. అది వారి పదవీకాంక్షనే వెల్లడిస్తోంది.

### కొంత ముందస్తుగా అయితేనేం ?

రాష్ట్ర అసెంబ్లీకి 2024 జనవరి 16 వరకు అధికారంలో ఉండే వీలుంది. మిగతా రాష్ట్రాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఈ సంవత్సరాంతంలోగా ఎన్నికలు జరుగుతాయనేది సాధారణ అంచనా. అప్పటిదాకా ఆగకుండా ఇంకొంత ముందస్తుగా ఎన్నికలు జరగవచ్చునని కొందరు పరిశీలకుల అభిప్రాయం. సెప్టెంబర్-అక్టోబర్‌లలోనే ఎన్నికలకు అూా ళ్లలనే యోచనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని, అందుకనుగుణంగా పావులు కదుపుతోందని, ఆషాఢం ముగియగానే తనస్కెచ్‌ను అమలు చేయనుందనే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. అయినా తప్పేమిటన్నది ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందుతున్న ప్రజల అభిప్రాయం. ప్రజలకు పథకాలు అమలు చేయడంతోపాటు అధికారాన్ని తిరిగి పొందడం కూడా రాజనీతిజ్ఞతే అవుతుంది తప్ప తప్పెలా అవుతుందని రాజకీయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక రాజుకైనా, చక్రవర్తికైనా, ప్రజా పాలకులకైనా కావాల్సింది యుద్ధంలోనో, ఎన్నికల్లోనో గెలవడం.. అధికార పీఠమెక్కడం మాత్రమే కాదు. ప్రజలు.. వారి సమస్యలు.. పరిష్కారాలు.. అందుతున్న ప్రయోజనాలు ఆగకుండా కొనసాగడాలూ. వారి కోసం యుద్ధతంత్రాన్నీ, సంక్షేమ మంత్రాన్నీ రెండింటినీ జోడెద్దుల్లా కొనసాగించగలిగే నైపుణ్యమూ అవసరమని, అలాంటి వారే విజేతలవుతారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### పనుల తీరే సాక్ష్యం..

ఎవరి పనితీరేమిటో జరుగుతున్న సంఘటనలే చెబుతాయి. కాంగ్రెస్, బీజేపీలు వివిధ కారణాలతో ఇంటిపోరుతో సతమతమవుతున్నాయి. అధికార బీఆర్ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయి.దాన్ని తిట్టందే తమకు గడవదన్నట్లుగా మారిపోయాయి. అధికసంఖ్యలో ఇతర పార్టీల వారిని చేర్చుకోవడం.. అందుకు భారీ బహిరంగసభలను ఏర్పాటు చేసి లక్షలాదిగా జనాన్ని తరలించే పనుల్లో నిమగ్నమయ్యాయి. అదే తమ విజయమని భావిస్తున్నాయి.

### బీఆర్ఎస్ నిశ్శబ్దంగానే..

బీఆర్ఎస్ మాత్రం చెప్పకుండానే నిశ్శబ్దంగానే ప్రచారాన్ని ప్రారంభించింది. అదీ మామూలుగా కాదు ప్రజల గుండెల్లో నాటుకునేలా. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 22 రోజుల పాటు వివిధ శాఖల ద్వారా నిర్వహించిన కార్యక్రమాలతో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలేమిటో చెప్పగలిగింది. రాబోయే రోజుల్లో అసెంబ్లీ సమావేశాల ద్వారానో, ఇతరత్రా కార్యక్రమాల ద్వారానో తాము చేసింది, ప్రతిపక్షాలు చేయంది కూడా వెల్లడించే అవకాశం ఉంది.



## పాతబస్తీలో గ్యాంగ్‌వార్

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై15):**

పాతబస్తీలో గ్యాంగ్‌వార్ జరిగింది. చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌పై గతంలో హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల మధ్య జరిగిన ఘర్షణలో కత్తులు, కర్రలతో దాడి చేసుకున్నారు. చాంద్రాయణగుట్టలో జరిగిన ఈ ఘర్షణలో అబ్దుల్లా హాఫేయి, హసన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. తనపై హత్యాయత్నం చేసిన వారినందరినీ క్షమిస్తున్నానని అక్బరుద్దీన్ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. అక్బర్ ఈ ప్రకటన తర్వాత నిందితుల మధ్య ఘర్షణ జరగడం చర్చనీయాంశంగా మారింది.

# వ్యర్థం నుంచి అర్థం

### దుండిగల్ ప్లాంట్ త్వరలో ప్రారంభం

1500 మెట్రిక్ టన్నుల చెత్తనుంచి 14.5 మెగావాట్ల విద్యుత్

మంత్రి కేటీఆర్ వెల్లడి

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై15):**

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి జరిగే మరో ప్లాంట్ త్వరలో ప్రారంభం కానుంది. నగర శివార్లలోని దుండిగల్‌లో చెత్తనుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి కె.తారకరమారావు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. జవహర్‌నగర్‌లోని చెత్తనుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ద్వారా ప్రస్తుతం రోజుకు 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. దుండిగల్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే 14.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. వెరసి మొత్తం 34.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తవుతుంది. వచ్చే సంవ్సరాంతానికి చెత్తనుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 101 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. గ్రేటర్ నగరం నుంచి రోజుకు ప్రస్తుతం దాదాపు 7వేల మెట్రిక్‌టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. దుండిగల్ ప్లాంట్‌కు 1500 మెట్రిక్ టన్నుల చెత్త అవసరం. అందులోంచి 800 మెట్రిక్‌టన్నుల మండించే గుణమున్న చెత్త(ఆర్‌డీఎఫ్)తో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు.హైదరాబాద్‌తో పాటు శివారు మునిసిపాలిటీల నుంచి





వెలువడే చెత్తతో రోజుకు 101 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఇటు చెత్త సమస్యల పరిష్కారంతోపాటు అటు విద్యుత్ ఉత్పత్తి జరగనుంది.




## రూ. 20 ఎర.. పది లక్షలు దోపిడీ

**తెలుగుప్రభ, గుంటూరు (జూలై 15)**

ఇరవై రూపాయలతో డైవర్ట్ వేసి దొంగలు ఏకంగా పది లక్షలు దోచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ దొంగతనంతో బాధితుడు లబోదిబో అంటున్నాడు. గుంటూరు బ్రాడీ పేటలో ఎమ్ ఎన్ ఎక్స్ పోర్టర్స్ కంపెనీ ఉంది. కంపెనీలో హరిబాబు గత పదేళ్లుగా గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఈ కంపెనీ మిర్చి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటుంది. అయితే నిన్న హరిబాబు లక్ష్మీ పురంలో హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ కు వెళ్ళాడు. యజమాని చెప్పినట్లుగానే పది లక్షల రూపాయలు డ్రా చేశాడు. హ్యాండ్ బ్యాగ్ లో క్యాష్ సర్దుకొని బయటికొచ్చాడు. బయట తన బైక్ పై కూర్చొన్నాడు. బైక్ స్టార్ట్ చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఇరవై రూపాయల నోట్లు పడిపోయాయని చెప్పాడు. బైక్ పక్కన చూసిన హరిబాబు కి ఇరవై రూపాయల నోట్లు కనిపించాయి.ఇంకేముంది పది లక్షల రూపాయల క్యాష్ బ్యాగ్ బైక్ పెట్టిన హరిబాబు బైక్ దిగి ఇరవై రూపాయల నోట్లు ఏరుతున్నాడు. అదే సమయంలో మరో ఆగంతకుడు బైక్ పై క్యాష్ బ్యాగ్ తీసుకొని వెళ్ళిపోయాడు. కొద్దీ దూరంలో బైక్ పై వేచి ఉన్న వ్యక్తితో కలిసి అదే బైక్ పై పారి పోయాడు. దీంతో హరిబాబు కంగారు పడుతూ కేకలు వేశాడు. అప్పటికే ముగ్గురు ఆగంతకులు మదర్ థెరిస్సా విగ్రహం వైపు పారిపోయారు. దీంతో హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పట్టాభిపురం పోలీసులు బ్యాంక్ లో సిసి కెమెరా విజువల్స్ పరిశీలించారు. ముఖానికి మాస్క్ లు పెట్టుకున్న ఆ ముగ్గురే బ్యాగ్ అపహరించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

## వాహనదారులకు అలర్ట్..

### హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు..

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 15)**




శని, ఆదివారాల్లో నగరం పూనకాలతో ఊగిపోనుంది. బోనాల సందడితో కళకళలాడనుంది. లాల్ దర్వాజ, అంబర్‌పేట, నగరంలోని చాలా ప్రాంతాల్లో బోనాల సంబరాలు అంబరాన్ని తాకనున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో రేపటి నుంచి మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా పలు రూట్లలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడనుంది. పలు మార్గాల వైపు ఆర్టీసీ బస్సులకు అనుమతి నిరాకరించనున్నారు. లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి బోనాలు, అంబర్‌పేట్ బోనాల సందర్భంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జులై 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. అలాగే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను చార్మినార్, ఫలక్‌నుమా, నయాపూల్ వైపు అనుమతించరు. ఓల్డ్ సీబీఎస్, అఫ్జల్‌గంజ్, దార్-ఉల్-షిపా క్రాస్ రోడ్ ఛత్రినాక, ఇంజన్ బలి వద్ద ఆ వాహనాలను నిలిపివేసి దారి మళ్లించనున్నారు. ఉప్పల్ నుంచి అంబర్‌పేట వచ్చే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను హబ్సిగూడ, తార్నాక, విద్యానగర్, ఫీవర్ హాస్పిటల్ మీదుగా ఉప్పల్ క్రాస్ రోడ్డుకు మళ్లిస్తారు. ఇక కోఠి నుంచి ఉప్పల్ వైపు వెళ్లే బస్సులను ఫీవర్ హాస్పిటల్, తార్నాక, హబ్సిగూడ మీదుగా మళ్లింపు చేపట్టనున్నారు.

## వందే భారత్ : మారుతున్న రంగులు

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశం పెట్టిన వందే భారత్ రైళ్లు కొద్ది రోజులకే రంగులు మారుతున్నాయి. కారణం ఏంటో కానీ.. ఇప్పటి వరకు నీలం, తెలుపు రంగులో ఉన్న ఈ రైళ్లు.. ఇకపై కాషాయ వర్ణంలోకి మారబోతున్నాయి. ఇప్పటికే రంగు మారిన రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ ఫ్యాక్టరీలో కేంద్ర మంత్రి పరిశీలించారు. అయితే, తెలుపు రంగులో ఉన్న రైళ్లను శుభ్రం చేసేటప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయని, అందుకే ఆ రంగుల స్థానంలో కాషాయం వర్ణంలోకి మార్చుతున్నట్లు ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు.

త్వరలోనే దేశవ్యాప్తంగా సంప్రదాయక పర్యాటక మార్గాలను అనుసంధానం చేస్తూ 'టి ట్రైన్'లను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే మంత్రి ప్రకటించారు. ప్రాచీన 'స్టీమ్ ఇంజన్' తరహాలో రూపొందించిన విద్యుత్ రైలింజన్‌తో కూడిన 'టి ట్రైన్'ను చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో మంత్రి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ హెరిటేజ్ స్పెషల్ రైలును మూడు నెలల్లోనే దేశంలో నడపనున్నట్టు వెల్లడించారు. ప్రజల్లో స్టీమ్ ఇంజన్ పట్ల ఉన్న ఆకర్షణ, అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని అదే తరహాలో విద్యుత్ ఇంజన్‌ను రూపొందించామని ఆయన తెలిపారు. రైలు కోచ్‌ల తయారీలో చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీకి ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఈనేపథ్యంలో ఐసీఎఫ్‌లో ఇప్పటి వరకూ 25 రకాల డిజైన్లలో 70 వేల బోగీలు తయారయ్యాయి. వందే భారత్ రైలు బోగీలు కూడా ఇక్కడే తయారవుతున్నాయి.

